క్లుప్తంగా

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ లాల్‌సింగ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని ఆగాపురాలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ లాల్‌సింగ్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, సోమ్‌రాజ్‌సింగ్, అమర్‌దీప్ సింగ్, సుధాకర్ గౌడ్, సుధీర్, కిషన్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న దృశ్యం

గోల్కొండ: మరొకరి ప్రాణం నిలపడానికి దానం ఇచ్చిన రక్తానికి విలువ కట్టలేమని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. దివంగత బీజేపీ నాయకుడు గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ స్మృతిలో సోమవారం గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియం వద్ద జనహిత సేవా సంస్థ వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివంగత దేవర కరుణాకర్ 35 సంవత్సరాలుగా రాజకీయాలలో ఉంటూ నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలలో పేదల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్పొరేటర్‌గా రెండు పర్యాయాలు ఆయన ప్రజా సమస్యలను ఎన్నో పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో దేవర వంశీ, అశ్విన్, నామ యాదగిరి, శ్రీకాంత్ సాగర్, పవన్‌సింగ్, అశోక్‌కుమార్ ఉన్నారు.

రాములుకు సత్కారం



కంట్రోలర్ రాములును సత్కరిస్తున్న అరుణ్‌కుమార్

అబిడ్స్: ఉస్మానియా యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్‌గా నియమితులైన ఎం.రాములును తెలంగాణ రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూంకుంట అరుణ్‌కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం విద్యారంగంలో దేశంలోనే నెంబర్:1 స్థానంలో ఉందన్నారు.

'మహా శివరాత్రిని ఘనంగా నిర్వహిస్తాం'



సురాభాండేశ్వరుడు

జియాగూడ: పురానాపూల్‌లోని సురాభాండేశ్వర గౌండ్లమఠంలో మహా శివరాత్రి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు గౌడిశాల నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్త నవీన్‌కుమార్ గౌడ్, సలహాదారు నిర్మల నీలకంఠం గౌడ్, బుర్ర భాస్కర్ గౌడ్, గోదా వెంకటేష్ గౌడ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆలయంలో మహా శివరాత్రి వేడుకల బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయంలో 18వ తేదీ మహాశివరాత్రి రోజున తెల్లవారుజామున రుద్రాభిషేకములు, సర్వ దర్శనము, రాత్రికి భజన సేవా కార్యక్రమాలు, శ్రీ స్వామివారి ఊరేగింపు, రాత్రి 11 గంటలకు అగ్నిగుండాల కార్యక్రమం, 12 గంటలకు సురాభాండేశ్వర భ్రమరాంబల కల్యాణం, ఒంటిగంట నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 19న ఆదివారం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని తెలిపారు.

రామకృష్ణారెడ్డి మహోన్నత వ్యక్తి

గన్‌ఫౌండ్రీ: ఆచార్య బి.రామకృష్ణారెడ్డికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడం ఎంతో సంతోషకరమని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆచార్య రామకృష్ణారెడ్డికి ఆత్మీయ సన్మాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు విశ్వవిద్యాలయంలో వివిధ విభాగాలలో సేవలందించడంతో పాటు సమాజంలోనూ ఎంతో మంచిపేరు తెచ్చుకున్న వ్యక్తి అని కొనియాడారు. జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు ఆచార్య జి.చెన్నకేశరెడ్డి, రసమయి అధ్యక్షుడు ఎంకే.రాము, భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు గంట జలందర్‌రెడ్డి, డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ పాల్గొన్నారు.

గుల్జార్‌హౌస్ ఫౌంటెయిన్ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



గుల్జార్‌హౌస్ ఫౌంటెయిన్‌ను కూల్చివేస్తున్న సిబ్బంది



కూల్చిన అనంతరం చుట్టూ రేకులతో ఏర్పాటు చేసిన బౌండరీ వాల్

- రూ.32 లక్షల నిధుల మంజూరు
- జీహెచ్ఎంసీ, కుడా ఆధ్వర్యంలో పనులు
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణ పనులు

చార్మినార్: పాతబస్తీలోని చారిత్రాత్మకమైన గుల్జార్‌హౌస్ ఫౌంటెయిన్ రూ.32 లక్షల నిధులతో పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తరచూ శిథిలావస్థకు చేరుకుంటున్న హెరిటేజ్ కట్టడమైన ఈ ఫౌంటెయిన్‌ను గతంలో జీహెచ్ఎంసీ ఎన్నోసార్లు మరమ్మతులు చేపట్టింది. అయినప్పటికీ శిథిలావస్థకు చేరుకోవడంతో చివరికి దీనిని పూర్తిగా నేలమట్టం చేసి పునర్నిర్మాణం పనులను జీహెచ్ఎంసీ, కులీ కుతుబ్ షా నగరాభివృద్ధి సంస్థ (కుడా) ప్రారంభించింది. నిజాం కాలం నాటి ఈ కట్టడాన్ని తిరిగి అదే తరహాలో పునర్నిర్మాణ పనులను చేపట్టడానికి అవసరమైన ప్రణాళికలన్నింటినీ రూపొందించి ప్రభుత్వానికి నివేదించడంతో రూ.32 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో పునర్నిర్మాణ పనులు ప్రారంభమై జోరుగా కొనసాగుతున్నాయి.

400 ఏళ్ల క్రితం..

400 ఏళ్ల క్రితం ఐదవ కులీ కుతుబ్ షా రాజ వంశానికి చెందిన మహ్మద్ కులీ కుతుబ్ షా పాలనలోని మొదటి ప్రధానమంత్రి మీర్ మోమీన్ అస్తారాబాదీ దీనిని నిర్మించారు. ఈ ఫౌంటెయిన్ నిజాం కాలంలో అప్పటి సైనికుల దాహాన్ని తీర్చడానికి అష్టభుజ ఆకారంలో నీటి రిజార్వాయర్ కోసం నిర్మించారు. చార్మినార్ కట్టడానికి ఉత్తర దిశలోని నాలుగు కమాన్ల రోడ్డు మధ్యలో గుల్జార్‌హౌస్ ఫౌంటెయిన్ నిజాం కాలంలో నిర్మాణం జరిగింది. కమాన్ల నుంచి 350 అడుగుల దూరంలో నాలుగు కూడలీల రోడ్డు మధ్యన ఈ ఫౌంటెయిన్ నిర్మాణం జరిగింది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

శిథిలావస్థకు చేరుకున్న ఈ ఫౌంటెయిన్ పునర్నిర్మాణ పనుల కోసం నిర్మాణ పనులను చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థ దాదాపు ఎనిమిది నెలల పాటు అధ్యాయనం చేపట్టింది. నిజాం కాలం నాటి చారిత్రాత్మకమైన కట్టడం తరహాలోనే ఈ పునర్నిర్మాణ పనులను నిర్వహించనున్నారు. దీనికి తోడు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రంగు రంగుల విద్యుద్దీప కాంతుల నడుమ ఫౌంటెయిన్ ద్వారా నీరు పైకి వెదజల్లే విధంగా తీర్చిదిద్దనున్నారు. ఇందుకు 5హెచ్‌పీ నీటి పంపును వినియోగించనున్నారు.

డైరీ, కేలండర్ ఆవిష్కరణ



డైరీ, కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సుల్తాన్‌బజార్: సెంట్రల్ గవర్నమెంట్ కన్నా ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం అధిక జీతాలు ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ హెల్త్ డిజిటల్ అధికారుల సంఘం (టీజీఓ) 2023 డైరీ, కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం కోఠిలోని డీఎంఈ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సంఘం పూర్వ అధ్యక్షుడు జూపల్లి రాజేందర్ సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై జూపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కోఠి డీఎంహెచ్ఎస్‌లో జూపల్లి రాజేందర్ అన్ని క్యాడర్ల ఉద్యోగాలను కలుపుకొని జేఏసీగా ఏర్పడి తెలంగాణ ఉద్యమానికి బాసటగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కలిముద్దీన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చంద్రశేఖర్, మేడ్చల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల డీఎంహెచ్‌లు పాల్గొన్నారు.

గిరిజన రిజర్వేషన్ల కోసం పోస్ట్‌కార్డు ఉద్యమం ప్రారంభం

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 10 శాతం గిరిజన రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి వెంటనే ఆమోదించాలని బీఆర్ఎస్ గిరిజన విద్యార్థి విభాగం నాయకుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గన్‌పార్కు వద్ద గిరిజన విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ ప్రారంభించిన చేనేత కార్మికుల సమస్యలపై ప్రారంభించిన పోస్టుకార్డు ఉద్యమాన్ని కొనసాగింపులో భాగంగా గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ల కోసం ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతామని తెలిపారు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ–2014 చట్టం ప్రకారం కేటాయించిన గిరిజన విశ్వవిద్యాలయం వెంటనే ప్రారంభించాలని కోరారు. సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా వెయ్యి మంది గిరిజన విద్యార్థులచే ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వెయ్యి పోస్టుకార్డులను పంపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి నాయకులు రవీందర్ నాయక్, సంతోష్ నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు కమిటీల ఏర్పాటు



అధికారులతో సమావేశమైన హైదరాబాద్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రమేశ్

యాకుత్‌పురా: ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎ.రమేశ్ తెలిపారు. పౌర సరఫరాల శాఖ యాకుత్‌పురా సర్కిల్ విజిలెన్స్ కమిటీ సమావేశాన్ని సోమవారం పురానీహవేలిలోని సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. కమిటీ సభ్యులతో జాతీయ ఆహార భద్రత పథకం చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు తీసుకోవాల్సిన అంశలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా, మండల, సర్కిల్ స్థాయిలో ప్రజా ప్రతినిధులు, స్థానిక సంఘాల కమిటీ ప్రతినిధులు, అంగన్‌వాడీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంఘాల సమన్వయంతో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ సమావేశంలో రియాసత్‌నగర్, తలాబ్‌చంచలం, గౌలిపురా, శాలిబండ డివిజన్ల కార్పొరేటర్లు సలీం బేగ్, డాక్టర్ సమీనా బేగం, ఆలే భాగ్యలక్ష్మి, ముజఫర్ అలీ, యాకుత్‌పురా సర్కిల్ ఏసీఎస్‌ఓ శ్రీనాథ్, సర్కిల్ రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు ధరావత్ రామకోటి, ఐసీడీఎస్, ఎస్సీ, ఎస్టీ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆద్య కళా వస్తువుల పరిరక్షణకు ప్రదర్శనశాల అవసరం



మాట్లాడుతున్న ఆచార్య తంగెడ కిషన్‌రావు, చిత్రంలో ఆచార్య జయధీర్ తిరుమలరావు

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో ఆదివాసీ జానపద సంస్కృతి, పరిరక్షణ బాధ్యత అనే అంశంపై సోమవారం సదస్సు జరిగింది. మట్టి మనుషులు సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ఆర్‌జే కళా కన్వీనర్ ఆచార్య గూడూరి మనోజ అధ్యక్షత వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆద్యకళను మనం హృదయానికి హత్తుకోవాలని, ఆద్య కళా వస్తువుల్ని పరిరక్షించడానికి శాశ్వతమైన ప్రదర్శనశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ.. ఆద్యకళకు సంబంధించి ఇటీవల ఫ్రాన్స్(ప్యారీస్)ను సందర్శించి అక్కడి ప్రఖ్యాత మ్యూజియాలను సందర్శించి వచ్చిన సందర్భంగా అక్కడి విశేషాలను పది మందికి తెలియజేయడానికి ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆచార్య మనోజ మాట్లాడుతూ.. విద్యార్థులు ఓ లక్ష్యంతో చదువుకోవాలని అన్నారు. మొబైల్ సంస్కృతి మనకు జీవితం కాదన్నారు. అరుణోదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు విమలక్క సదస్సులో ఆదివాసీ సంస్కృతి, ఆద్యకళపై ఓ చక్కని పాటపాడి సభికుల్ని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో ఆద్యకళ కమిటీ సభ్యులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం నృత్య సమ్మోహనం



గన్‌ఫౌండ్రీ: ఎస్ఎల్‌బీ కూచిపూడి కళానిలయం 17వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ గురువు డాక్టర్ వినీలరావు శిష్యబృందం ప్రదర్శించిన ప్రహ్లాద పట్టాభిషేకం, బాలగోపాల, శంకర శ్రీగిరి వంటి నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి మాట్లాడుతూ.. చిన్నారులను పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ నృత్యాల పట్ల తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం నృత్యగురువులను సన్మానించారు. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, పారిశ్రామిక వేత్త విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అభినందనలు



మంత్రి హరీష్‌రావుతో ఎమ్మెల్యే కౌసర్


గోల్కొండ: మీ పనితీరు, వాగ్ధాటి ఎంతగానో ఆకట్టుకునే విధంగా ఉంటాయని రాష్ట్ర ఆర్థిక మంత్రి టి.హరీష్‌రావు ఎమ్మెల్యే కౌసర్‌ను అన్నారు. సోమవారం అసెంబ్లీ వద్ద మంత్రి ప్రత్యేంగా కౌసర్‌ను కలిసి ఆయనను అభినందించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే కౌసర్ లేవనెత్తే అంశాలకు ఎన్నో ప్రత్యేకతలు ఉంటాయని ఆయన అన్నారు.

డాక్టర్ కేశవరెడ్డికి ఘన నివాళి



నాంపల్లి: తెలుగు నవలా రచయిత డాక్టర్ కేశవరెడ్డి వర్ధంతి వేడుకలు జరిగాయి. ఈ వేడుకలను సోమవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాహిత్య విమర్శకులు ఎకే ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ కేశవరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి ప్రసంగించారు. తెలుగు సాహిత్యంలో వైవిధ్యం, విశిష్టత కలిగిన ఒకే ఒక రచయిత అని కీర్తించారు. అట్టడుగు వర్గాల జీవితాలపై అనేక రచనలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మట్టి మనిషి పాండురంగారావు, ఏపీ.అరవింద్, జితేందర్, చరణ్, ప్రవీణ్, ఉపేందర్, అలీమ్, సౌమ్య, నవ్య, పవన్, వైష్ణవి, కవిత పాల్గొన్నారు.

గోషామహల్‌లో 'ప్రజా గోస-బీజేపీ భరోసా'



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా గోస- బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. గోడేకబార్, జుమ్మేరాత్‌బజార్‌లో కార్యక్రమాలు నిర్వహించి కేసీఆర్ ప్రభుత్వ అవినీతి అక్రమాలు ప్రజలకు వివరించారు. నట్రాజ్ నాందారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు హరీష్, కార్పొరేటర్ లాల్ సింగ్, కన్వీనర్ కృష్ణ పాల్గొని ప్రసంగించారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు చిత్తుగా ఓడిస్తారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ముక్క కృష్ణాగుప్తా, వినోద్, మ్యాదరి మహేష్, మురళి, అమర్‌దీప్‌సింగ్, విపిన్ రామవత్, సందీప్ సింగ్, సాయి, కిశోర్, అనిల్, విశాల్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ మూత్రశాలలో అగ్నిప్రమాదం

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీహెచ్ఎంసీ మూత్రశాలలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని మూత్రశాలను నిరుపయోగంగా ఉంచడంతో యాచకులు షెల్టర్‌గా వినియోగిస్తున్నారు. సోమవారం అందులో ఎవరూ లేని సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న ఫలక్‌నుమా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బందిని రప్పించి మంటలనార్పించారు. గుర్తుతెలియని వ్యక్తులెవరైనా పొగ తాగే క్రమంలో నిప్పంటుకొని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

పార్టీ కోసం పని చేసే వారికి తగిన గుర్తింపు

హోంమంత్రి మహమూద్ అలీ



హోంమంత్రిని కలిసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు

చార్మినార్: బీఆర్ఎస్ పార్టీ అన్ని సామాజిక వర్గాలకు సమ న్యాయం చేస్తుందనిహోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. ఇప్పటి వరకు పార్టీ కోసం ఆహర్నిషలు పని చేస్తున్న సీనియర్లను పార్టీ అధిష్టానం గుర్తించి వారికి తగిన న్యాయం చేస్తుందన్నారు. సోమవారం చార్మినార్ నియోజకవర్గానికి సీనియర్ బీఆర్ఎస్ నాయకులు హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీని కలిసి పార్టీ పదవుల కోసం చేపట్టిన నియామకాలపై వినతిపత్రం అందజేశారు. చార్మినార్ నియోజకవర్గానికి మహిళా అధ్యక్షురాలి పదవీని నియమించినట్లు ఓ పత్రికలో వచ్చిందనే విషయాన్ని నాయకులు హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఎలాంటి నియామకాలు చేపట్టలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పుస్తె శ్రీకాంత్, పుప్పాల రాధా కృష్ణ, పెండ్యాల లక్ష్మణ్‌రావు, అనూషాగౌడ్, ఇలియాజ్ ఖురేషి, మల్లికార్జున్ యాదవ్, గోపిగౌడ్, గడ్డం సత్యనారాయణ, గడ్డం శ్రీరాం పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్‌లు ఆ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న టోలీచౌకి పోలీస్‌స్టేషన్ కోసం అద్దె భవన పరిశీలన కోసం ఆయన పోలీసు అధికారులతో కలిసి టోలీచౌకిలో పర్యటించారు. ఈ సందర్భంగా పశ్చిమ మండలం డీసీపీ జోయల్ డేవిస్‌తో టోలీచౌకి పరిసరాలలోని కొన్ని భవనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధి ఎంతో విస్తృతమైందని అందువల్లే టోలీచౌకికి పోలీస్‌స్టేషన్ మంజూరయ్యిందన్నారు. టోలీచౌకి చౌరస్తాకు సమీపంలో ఉండడంతో పాటు పాత ముంబై జాతీయ రహదారికి దగ్గరలో పోలీస్‌స్టేషన్ ఉంటే అందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా టోలీచౌకి పరిసరాలలో కాలనీలు ఎక్కువగా ఉన్నాయని, కాలనీలలో దొంగతనాలు ఎక్కువగా ఉంటాయన్నారు. నూతన పోలీస్‌స్టేషన్ టోలీచౌకి చౌరస్తాకు సమీపంలో ఉంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ తదితర వాటిపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆయన వెంట అదనపు డీసీపీ ఎక్బాల్ సిద్దిఖి, ఏసీపీ శివమారుతి తదితరులు ఉన్నారు.

ఖేలో ఇండియాలో సిటీ కళాశాల విద్యార్థుల సత్తా



బేబీ రెడ్డి



మురళీ



శ్రవణ్

చార్మినార్: జనవరి 30 నుంచి ఫిబ్రవరి 11 వరకు మధ్యప్రదేశ్‌లోని 11 నగరాలలో జరిగిన ఖేలో ఇండియా యువజన క్రీడల్లో ఫెన్సింగ్ అండర్–18 విభాగంలో తెలంగాణ తరపున పాల్గొన్న సిటీ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. బీఏ విద్యార్థులు బేబీ రెడ్డి, మురళీ. బి.శ్రావణ్ కళాశాల పేరును మరోసారి జాతీయ స్థాయిలో చాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాలభాస్కర్ తెలిపారు. బేబీ రెడ్డి రజత పతకం సాధించగా మురళీ, శ్రవణ్ కాంస్య పతకాలు సాధించి కళాశాలకే కాక రాష్ట్రానికి కూడా గర్వకారణంగా నిలిచారన్నారు. ఇలా తమ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై విజయాన్ని చేజిక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. విజేతలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

నుమాయిష్‌కు ఎంతో చరిత్ర: హోంమంత్రి



పోలీసు ఉన్నతాధికారులకు బహుమతులను అందజేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రతి ఏటా నిర్వహించే నుమాయిష్ ఎంతో చరిత్ర కలిగిందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో 82వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎగ్జిబిషన్‌ను భారీ సంఖ్యలో సందర్శకులు రావడం ఎంతో అభినందనీయమన్నారు. చిన్న స్థాయి వ్యాపారవేత్తలకు ఇది ఇక ఆదర్శ వేదిక అని ఈ వేదికను ఒకేరోజు దాదాపు లక్షమంది సందర్శకులు వీక్షించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన పోలీస్, ట్రాఫిక్ ఉన్నతాధికారులతో పాటు వివిధ స్టాళ్ల నిర్వాహకులకు బహుమతులను అందజేశారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్విన్‌మార్గం, కార్యదర్శి సాయినాథ్ పాల్గొన్నారు.

పర్వతాన్ని అధిరోహించిన టీఎన్జీఓ సభ్యుడు



అర్జెంటీనా పర్వతంపై టీఎన్జీఓ సభ్యులు వేముల నితిన్

అబిడ్స్: అర్జెంటీనాలో పర్వతారోహణను హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ నాయకులు, ఐ అండ్ పీఆర్ సీనియర్ అసిస్టెంట్ వేముల నితిన్ అధిరోహించి భారతీయ జాతీయ జెండా, టీఎన్జీఓస్ జెండాను ఎగరవేశారని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు, సేవారత్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఓ ప్రకటనలో తెలిపారు. వేముల నితిన్ అమెరికాలోని అర్జెంటీనా పర్వతాన్ని అధిరోహించడం ఎంతో గర్వకారణంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఓ మధ్యతరగతి ఉద్యోగి పర్వతారోహణ చేసి అమెరికాలోని అర్జెంటీనాలో పర్వతారోహణ చేయడం హైదరాబాద్ టీఎన్జీఓ యూనియన్‌కు గర్వకారణమన్నారు.

ముగిసిన మల్లయుద్ధం పోటీలు



బహుమతులను అందజేస్తున్న విక్రమ్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: శ్రేష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న ముఖేష్‌గౌడ్ స్మారక మల్లయుద్ధ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. మాజీ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు ఈ పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. శ్రేష్ట ఫౌండేషన్ వ్యవస్థాపకులు విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవసరమైన ఆర్థిక సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. వీరికి రూ.5 లక్షలను ఉపకార వేతనాల రూపంలో ఏడాదిపాటు అందజేస్తామని ప్రకటించారు. అనంతరం బాలకేసరి, పురుషులు, మహిళల విభాగాల్లో గెలుపొందిన విజేతలకు బంగారుపతకం, లక్ష రూపాయల నగదును అందజేశారు. అదేవిధంగా రజత పతకానికి రూ.50 వేలు, కాంస్య పతకం సాధించిన వారికి రూ.25 వేల చొప్పున బహుమతులను అందజేశారు.

బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం



ఆందోళన చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

గన్‌ఫౌండ్రీ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో బీసీలకు జనాభా దామాష ప్రకారం నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేశారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీ వ్యతిరేక పార్టీలు అని ధ్వజమెత్తారు. బీసీల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ సోమవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కుల గణనను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీల అభ్యున్నతికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ పెంచాలన్నారు. ఇకనైనా కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో బీసీలకు లక్ష కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో త్వరలోనే జాతీయ రహదారులు, రైల్వేదారులను ముట్టడిస్తామని హెచ్చరించారు. జనాభా దామాష ప్రకారం.. రిజర్వేషన్లు పెంచాలని లేని యెడల రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి విభాగం కేంద్రకమిటీ అధ్యక్షులు టి.విక్రమ్‌గౌడ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్‌కురుమ, మహిళా విభాగం రాష్ట్ర నాయకులు మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.